క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తూరు విద్యార్థి


అఖిల్

ఇందుకూరుపేట : ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అండర్–14 విభాగంలో మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.అఖిల్ ఎంపికైనట్లు హెచ్‌ఎం వి.మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఎంపికల్లో విద్యార్థి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సాధించారని ఆయన చెప్పారు. ఎంపికైన విద్యార్థితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.అరోరాను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బాబా మందిరంలో ఎమ్మెల్యే పూజలు



విడవలూరు : మండలంలోని దంపూరు గ్రామంలో ఉన్న సాయిబాబా మందిరంలో వార్షికోత్సవ వేడుకలు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని, సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయినాథుని ఊరేగింపు ఘనంగా జరిపారు.

విడవలూరులో స్వచ్ఛత హీ సేవ


రోడ్లను శుభ్రం చేస్తున్న అధికారులు, నాయకులు

విడవలూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కార్యాలయ పరిసరాల్లో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి, రోడ్లపై పేరుకుపోయిన చెత్త చెదారాలను తొలగించారు.

శిథిలావస్థలో వంతెన

• భయాందోళనలో వాహనదారులు


ప్రమాదకరంగా మారిన వంతెన

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు పంచాయతీ వీరాంజనేయస్వామి ఆలయ సమీపంలో ఇరిగేషన్ కాలువపై ఉన్న ప్రధాన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల పంట పొలాలకు సంబంధించి సాగునీరందించే భారీ కాలువపై 75 ఏళ్ల కిందట ఈ వంతెనను నిర్మించారు. పురాతన వంతెన కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. అధ్వానంగా మారిన వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన వంతెనపై వాహనదారులు రాకపోకలు సాగించాలంటే హడలిపోవాల్సి వస్తోంది. దుస్థితికి చేరిన వంతెన ప్రమాదవశాత్తు కూలితే తోటపల్లిగూడూరు మార్గం నుంచి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ప్రమాదకరంగా మారిన వంతెనను పునర్నిర్మించేందుకు గత కొన్నేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర స్థితిలో ఉన్న పురాతన వంతెన స్థానంలో మరో నూతన వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

జాతిపితకు ఘన నివాళి

భారత జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలు వేసి ఘన నివాళి అర్పించారు. గాంధీ సిద్ధాంతాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.


వెంకటాచలం : వీఎస్‌యూలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

• ఘనంగా మహాత్మా గాంధీ జయంతి

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.విజయ, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

పొదలకూరు : జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి వేడుకలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సురేఖ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ కార్యాలయంలో..

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి గాంధీ చేసిన సత్యాగ్రహ దీక్ష గురించి వివరించారు. ఏఓ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవనంలో..

పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు కె.కోటేశ్వరరావు, మస్తాన్‌సాహెబ్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

విడవలూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉదయ్, హరిప్రసాద్, స్థానిక నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, చెముకుల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

• **తోటపల్లిగూడూరు** : నవభారత నిర్మాణ కర్త గాంధీ జయంతి వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ఈ క్రమంలో మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కౌసల్యమ్మ ఆధ్వర్యంలో, రెవెన్యూ కార్యాలయంలో డీటీ శివయ్య ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గాంధీ జయంతిని నిర్వహించారు.

ఘనంగా బాపూజీ, శాస్త్రిల జయంతి

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో బాపూజీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెన్‌కో సీఈ సుధీర్‌బాబు ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలను వివరించారు. ఇదే విధంగా అదాని కృష్ణపట్నం పోర్టు, ఎస్‌ఈఐఎల్ పవర్ ప్రాజెక్టు, పలు సచివాలయాల్లో బాపూజీ జయంతిని జరిపారు.

మహాత్ముని జీవితం ఆదర్శప్రాయం

మనుబోలు : గాంధీ జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని డిప్యూటీ తహసీల్దార్ బషీర్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జాతినంతా ఏకతాటిపై నిలిపి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహనీయులు గాంధీజీ అని కొనియాడారు. అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ ప్రసాద్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, భగవాన్, మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ మార్గంలో పయనిద్దాం

కొడవలూరు : గాంధీ చూపిన అహింసా మార్గంలో పయనిద్దామని ప్రిన్సిపల్ పి.దేవసహాయం పిలుపునిచ్చారు. నేతాజీ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో కొడవలూరు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసా మార్గం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహనీయులు గాంధీజీ అని కొనియాడారు. ఆ సమితి అధ్యక్షుడు కోవూరు వెంకీ మాట్లాడుతూ నేటి యువత గాంధీ అడుగు జాడల్లో పయనించాలన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కె.సుమంత్, ఎం.జీవన్, కె.సుజిత్, డి.భార్గవ్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర కళాశాలలో..

నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక మీనమ్మగుంట గిరిజన కాలనీలో ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ గాంధీజీ కలలను నిజం చేసేందుకు విద్యార్థులంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి పి.రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్‌లు సీహెచ్.సతీష్, పీఎస్.యాసిన్, పి.ఫణికుమార్, కె.బాలు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విడవలూరు ఎంపీడీఓ కార్యాలయంలో..


మనుబోలు తహసీల్దార్ కార్యాలయంలో..


కొడవలూరు గురుకులంలో..

గాంధీ ఆశ్రమ అభివృద్ధికి కృషి

• కలెక్టర్ ఆనంద్

ఇందుకూరుపేట : బాపూజీ స్వహస్తాలతో ప్రారంభించిన పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ ఆనంద్ అన్నారు. పల్లిపాడులోని ఆశ్రమంలో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. దేశంలోనే రెండు గాంధీ ఆశ్రమాలను సందర్శించానని, అందులో ఒకటి సబర్మతి కాగా, మరొకటి మన జిల్లాలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమం అని చెప్పారు. ఇంత గొప్ప చరిత్ర ఉన్న ఆశ్రమం మన జిల్లాలో ఉండడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ ఆశ్రమంలో చేపట్టాల్సిన పనులపై దృష్టి పెట్టామని, త్వరలో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఆశ్రమంలోని గ్రంథాలయాన్ని అన్ని వసతులతో అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు నగరంలోని నగరవనం, సైన్స్ పార్కు, మ్యూజియం, పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని అనుసంధానిస్తూ విహార యాత్ర చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. తొలుత ఆశ్రమ ఆవరణలోని గాంధీజీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూలు రాట్నంలో నూలు వడికారు. అనంతరం దేశభక్తి ఉట్టిపడేలా సాయిరాం ఇంగ్లిష్ మీడియం, కృష్ణ చైతన్య విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మహాత్ముడు నడయాడిన నేల

మహాత్ముడు బాపూజీ నడయాడిన నేల పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో ఆశ్రమం ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. తొలుత గాంధీ, కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సురేష్‌నాయుడు, మేనేజింగ్ కమిటీ ట్రెజరర్ సురేష్‌జైన్, గుణపాటి ప్రసాద్‌రెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రాట్నంలో నూలు వడుకుతున్న కలెక్టర్


పొదలకూరు : గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు


పొదలకూరు : ఎంపీపీ కార్యాలయంలో..


పొదలకూరు : విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో..


ముత్తుకూరు : బాపూజీ, లాల్‌బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీఈ సుధీర్‌బాబు


కొడవలూరు: వెంకటేశ్వర కళాశాలలో..

కృష్ణపట్నంలో కోస్టల్ క్లీనప్

ముత్తుకూరు : గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కృష్ణపట్నం సముద్ర తీరంలో బుధవారం కోస్టల్ క్లీనప్ నిర్వహించారు. ముత్తుకూరు మత్స్యకళాశాలకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొని, తీరం పొడవునా పేరుకుపోయిన చెత్త కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ, బాపూజీ నిర్వచించిన పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


తీరంలో చెత్తను ఏరివేస్తున్న మత్స్యకళాశాల విద్యార్థులు

బాణసంచా పేలుళ్ల బాధితులకు సాయం

మనుబోలు : మనుబోలు బీసీ కాలనీలో ఇటీవల వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న బాణసంచా పేలుళ్లలో బాధితులకు సేవానాథం ట్రస్ట్ చేయూతనిచ్చింది. ట్రస్ట్ చైర్మన్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి బుధవారం బాధితులకు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, ఉత్సవ నిర్వాహకులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంద్రాతి గిరీష్‌కు రూ.25 వేలు, మోమిడి లోకేష్‌కు రూ.20 వేలు, స్వల్ప గాయాలైన కొమరాల మౌనికకు రూ.5 వేలు అందజేశారు. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు మహీధర్‌రెడ్డి, భార్గవ్ తదితరులు ఉన్నారు.


నగదు సాయం అందజేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

ఎక్సైజ్ సర్కిల్లో 17 మద్యం షాపులు

పొదలకూరు : పొదలకూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాలుగు మండలాలకు మొత్తం 17 మద్యం షాపులకు అనుమతి లభించినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పొదలకూరు–6, సైదాపురం–4, చేజర్ల–3, రాపూరు–4 షాపులకు లాటరీ పద్ధతిలో లైసెన్సును మంజూరు చేసినట్లు తెలియజేశారు.

కాకాణికి అభినందన



మనుబోలు : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మండలంలోని వెంకన్నపాళెం, పిడూరుపాళెం, గోవిందరాజపురం గ్రామాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు బుధవారం నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు గుంజి రమేష్, ఉగ్గుమూడి గోపీనాథ్‌రెడ్డి, ఆవుల మనోహర్‌రెడ్డి, గుత్తికొండ బ్రహ్మయ్య, మాడా రామకృష్ణ, రాజా, కంటే సాయితేజ, రమణయ్య ఉన్నారు.

సీహెచ్‌సీలో కంటి విభాగం మూత

• అపోలో కాంట్రాక్ట్ పూర్తి
• పేదలకు అందని కంటి పరీక్షలు

పొదలకూరు : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కంటి విభాగం మూత పడింది. గత పదిరోజులుగా ఆప్తాలమిస్ట్ ఇక్కడకు రావడం లేదు. గత ప్రభుత్వంలో ఇక్కడి కంటి విభాగం చుట్టుపక్కల మండలాలకు చెందిన వేలాది మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు అందించింది. ఇందు కోసం అపోలో హాస్పిటల్ వారికి కాంట్రాక్ట్ అప్పగించారు. అయితే ప్రస్తుతం కాంట్రాక్ట్ సమయం పూర్తి కావడంతో సీహెచ్‌సీలో కంటి విభాగం తాత్కాలికంగా మూసివేశారు. ఫలితంగా ప్రతినిత్యం కంటి పరీక్షలు, అద్దాల కోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు ఇక్కడ కంటి పరీక్షలు ఉచితంగా చేయించుకుని కంటి అద్దాలు పొందేవారు. ఇందు కోసం చేజర్ల, కలువాయి, సైదాపురం మండలాల నుంచి కూడా సీహెచ్‌సీకి వచ్చేవారు.

టెండర్లు నిర్వహిస్తేనే..

కంటి విభాగం తెరుచుకుని పేదలకు వైద్యం అందాలంటే ప్రభుత్వం టెండర్లను నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు అపోలో వారు కాంట్రాక్టు దక్కించుకుని కంటి అద్దాలు అందజేశారు. అయితే ప్రభుత్వం టెండర్లను నిర్వహించి తిరిగి కంటి విభాగాన్ని పునరుద్ధరించాలంటే సమయం పడుతుందంటున్నారు. ఎంత సమయం తీసుకుంటుందో స్పష్టత లేదంటున్నారు. ఈలోగా కంటి అద్దాలు అవసరమైన వారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయమై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ మాట్లాడుతూ గతనెలలో అపోలో కాంట్రాక్టు పూర్తి కావడం వల్ల అద్దాల పంపిణీ నిలిచిపోయిందన్నారు. తిరిగి టెండర్లు నిర్వహించి థర్డ్‌పార్టీకి అప్పగిస్తే పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేస్తారన్నారు.


మూసి వేసిన సీహెచ్‌సీలోని కంటి విభాగం

నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామని దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, గ్రామోత్సవాలు జరుగుతాయన్నారు. గురువారం రాత్రి కన్యకాపరమేశ్వరి అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. నవరాత్రుల అనంతరం మరో నాలుగు రోజులు అదనంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నేటి నుంచి దసరా నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తామని దేవస్థానం పాలక కమిటీ పేర్కొంది. వీరలక్ష్మి, విజయలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్యలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధనలక్ష్మి, గజలక్ష్మి, విద్యాలక్ష్మి, ఆదిలక్ష్మి అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. ప్రతినిత్యం ఉదయం 9 గంటలకు, రాత్రి 7 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరుగుతాయన్నారు. ఉభయకర్తలుగా వ్యవహరించాలనుకునే వారు దేవస్థానం నిర్వాహకులను సంప్రదించాల్సిందిగా సూచించారు.

కాంతమ్మతల్లి ఆశ్రమంలో..

మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో అవధూత ఆదిపరాశక్తి కాంతమ్మతల్లి ఆశ్రమంలో నేటి నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆశ్రమ పీఠాధిపతి ఎన్.సుబ్బారెడ్డిస్వామి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.


పొదలకూరు : కన్యకా పరమేశ్వరీదేవి

జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో..

తోటపల్లిగూడూరు : మండలంలోని వరిగొండలో కొలువైన జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వాహకుడు తాతా శ్రీనివాసరావు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ 3న కలశస్థాపనతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 12వ తేదీతో జరిగే మహిషాసురమర్ధిని కార్యక్రమంతో ముగుస్తాయన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని పది రోజుల పాటు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు, విశేష అభిషేకాలు జరుగుతాయన్నారు. ఉత్సవాల చివరి రోజు 12వ తేదీ మధ్యాహ్నం ఆలయంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. అదేరోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వేడుకగా జరుగుతుందన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి


చినుకు జాడ లేకపోవడంతో నోరెళ్లబెడుతున్న పొలాలు


మేత కోసం బీడు పొలాల్లో ఆకలిపోరాటం సాగిస్తున్న మూగజీవాలు

తీరప్రాంత మండలమైన తోటపల్లిగూడూరు ఎన్నడూలేని విధంగా కరువుకోరల్లో చిక్కుకుంది. అప్పుడప్పుడు మేఘాలు కమ్ముకుంటుందే తప్ప వర్షం కురిసింది లేదు. దీంతో మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

• వర్షం జాడ కోసం రైతుల ఆశలు
• ఆందోళనలో తీరప్రాంత వాసులు

తోటపల్లిగూడూరు : మండల పరిధిలో ప్రతి ఏడాది ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు మండలంలో 30 మిల్లీలీటర్ల మేర సాధారణ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాదిలో ప్రస్తుతానికి 5 మిల్లీలీటర్ల మేర వర్షపాతం నమోదైంది. నైరుతి రాష్ట్రంలో ప్రవేశించి నెలలు గడుస్తున్నాయి. అయినా వానలు జోరందుకోకపోడంతో మండలంలోని అన్నివర్గాల వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో చిరు జల్లులు కురిసినా వాటి వల్ల నేలలు కూడా తడవలేదు. ఇదిలా ఉంటే గడిచిన వారం రోజులుగా ఎండలు మండిపోతుండడంతో మండల వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

వెలవెలబోతున్న చెరువులు, గుంతలు

వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలోని పలు చెరువులు, గుంటల్లో చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. ఈ పరిస్థితిలో ముంచుకొస్తున్న రబీ సీజన్‌ను ఎలా మొదలుపెట్టాలో రైతులకు తెలియడం లేదు. నారుమళ్లు సిద్ధం చేసుకోవాల్సిన సమయంలో వానలు ఆలస్యమైతే సాగు ఆలస్యమై దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కాగా పచ్చిగడ్డితో కళకళలాడాల్సిన పంట పొలాలు బీళ్లుగా మారడంతో పచ్చిక మేత కరువై పశువులు, మూగజీవాలు విలవిల్లాడాల్సిన పరిస్థితి నెలకొంది. తీర ప్రాంతంలోని బోరుబావుల్లో సైతం సాగునీరు అడుగంటిపోవడంతో అటు తాగునీటికి ఇటు సాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. వర్షాలు ఇంకా ఆలస్యమైతే తీర ప్రాంత వాసులు మరింత గడ్డు పరిస్థితిని ఎదుర్కోక తప్పదు.

గతంలో ఎన్నడూ చూడలేదు



ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదు. ఈ సమయానికి మోస్తరు వర్షాలతో చెరువుల్లో సాగు నీరు చేరేది. ప్రస్తుతం నారుమళ్లను సిద్ధం చేసుకోవాల్సిన సమయం వచ్చింది. అయితే ఎక్కడా చుక్క నీరు లేకపోవడంతో సాగుకు దూరమయ్యే పరిస్థితి ఎదురవుతోంది.

– కోటా శేఖర్‌రెడ్డి, రైతు, వరిగొండ పంచాయతీ